క్లుప్తంగా

గ్రామకంఠం స్వాధీన ప్రక్రియ వేగవంతం చేయండి

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామ కంఠం స్వాధీనం ప్రక్రియను వేగవంతం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ, తహసీల్దార్ స్వర్ణకు సూచించారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నోటిఫికేషన్‌లో పేర్కొన్న గ్రామాల్లో ఆర్వోఆర్ ప్రక్రియను వేగవంతం చేసి, ఆస్తి యజమానులకు హక్కు పత్రాలను అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీటీ శ్రీనివాసులు, ఆర్‌ఐ చైతన్య, రీసోర్సు పర్సన్‌లు రాజశేఖరరెడ్డి, మనోజ్ఞ, రాజా పాల్గొన్నారు.

పంచాయతీల్లో డీఎల్‌పీఓ పర్యటన



విలేజ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

దొరవారిసత్రం: తల్లంపాడు, శ్రీధనమల్లి పంచాయతీల్లో మంగళవారం గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ పర్యటించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు అమల, ఖాదర్‌మస్తాన్, ప్రవీణ్, వీఆర్వో వెంకటరత్నం ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్పెషల్ డ్రైవ్

నాయుడుపేటటౌన్: ట్రాఫిక్ నియంత్రణకు సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు సారథ్యంలో ఎస్‌ఐ వేణు మంగళవారం పోలీస్ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రోడ్డుకు అడ్డంగా ఆపి ఉన్న వాహనాల యజమానులు, దుకాణాలదారులతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపకూడదని హెచ్చరించారు.

వైద్య ఖర్చులకు రూ.50 వేలు సాయం

గూడూరు: రాజనేని రామానాయుడు ట్రస్టు ఆధ్వర్యంలో కాలు పోగొట్టుకున్న ఓ యువకునికి కృత్రిమ కాలు ఏర్పాటుకు రూ.50 వేల ఆర్థిక సాయం మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులు అందజేశారు. గూడూరు రూరల్ మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన అవిసాని మస్తానయ్య అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలుపోగొట్టుకున్నాడు. రామానాయుడు ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసులునాయుడు ఈ విషయం తెలుసుకుని, మస్తానయ్యకు హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించారు. అలాగే ఆయనకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసేందుకు తమ ట్రస్టు ద్వారా రూ.50 వేలు అందజేశారు.

'వంద సూత్రాలు' పుస్తకాల పంపిణీ

సూళ్లూరుపేట: ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ రచించిన మొదటి ర్యాంక్ సాధనకు వంద సూత్రాలు అనే పుస్తకాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం అందజేశారు. గద్వాల్ జిల్లా విద్యావారధి ఫౌండేషన్ చైర్మన్ జీ సుబ్బరాజు సహాయ సహకారంతో సూళ్లూరుపేట సేవా సమాఖ్య వారు సౌజన్యంతో ఈ పుస్తకాలను డీవైఈఓ శివప్రకాష్‌రెడ్డి చేతులు మీదు గా అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం గజేంద్ర, సూళ్లూరుపేట సేవా సమాఖ్య ప్రతినిధులు షేక్ ఉస్మాన్‌బాషా, దాము తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

నాయుడుపేటటౌన్: స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని ప్రదర్శించిన నాటక ప్రదర్శనలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. మెగా ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన విజయకుమార్ రాథోడ్, సేఫ్టీ అధికారి రమేష్ సారథ్యంలో ప్రత్యేక బృందం రహదారి భద్రతలపై నాటక ప్రదర్శన నిర్వహించారు. గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, వైస్ ప్రిన్సిపల్ డీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతకు కృషి

నాయుడుపేట: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గూడూరు డీవైఈఓ శివప్రకాష్ రెడ్డి సూచించారు. పట్టణంలోని ఏల్‌ఏ సాగరం ఉన్నత పాఠశాలలో విజయసాధన తరగతులను పరిశీలించారు.

సంపూర్ణ ఆహారంతోనే వ్యాధి నిరోధకశక్తి

వెంకటగిరి: సంపూర్ణ ఆహారంతోనే వ్యాధి నిరోధకశక్తి పెంపొందుతుందని కౌన్సిలర్ ఎంఏ నారాయణ తెలిపారు. పట్టణంలోని 4వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆయన వైఎస్సార్ సంపూర్ణ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారులు, మహిళల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలిస్తుందన్నారు. అలాగే 23వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఏ శ్రీనివాసులురెడ్డి కూడా వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేశారు.

నిర్మాణం వేగవంతం చేయండి

గూడూరు: కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో జరుగుతున్న మార్కెట్ నిర్మాణ పనులను మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖరులోగా పనులను పూర్తి చేసి, వ్యాపారులకు అందజేసేలా చూడాలన్నారు. అలాగే కూరగాయల మార్కెట్‌ను ఆనుకుని ఉన్న, ఖాళీ స్థలంలో చేపలు, మాంసం మార్కెట్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



లబ్ధిదారుకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరు, పెరుమాళ్లపల్లె, అనకవోలు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే సంజీవయ్య మాట్లాడుతూ ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని భావించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు అమలు చేశారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు అత్యవసర సమయంలో మెరుగైన వైద్యం అందించి, ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సేవ చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండు ఎకరాలతో రాజకీయ జీవితం ప్రారంభించి, రామారావుకు వెన్నుపోటు పొడిచి, బతికినంతకాలం అబద్ధాలు చెప్పుకుంటున్న చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. లోకేష్ చేపట్టే పాదయాత్ర, పవన్ బస్సు యాత్ర కేవలం చంద్రబాబు ఉనికిని కాపాడుకోవడం కోసమేనన్న విషయం ప్రజలకు తెలుసన్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కలిసి ఎన్ని కుట్రలు చేసినా మరో 30 ఏళ్లు సీఎంగా జగనన్న సుపరిపాలన అందించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ అర్థమాల చెంచురామయ్య, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, నాయకులు చంద్రయ్యనాయుడు, రఘునాయుడు, మోహన్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు, మధుసూదన్‌రెడ్డి, మునివర్ధన్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, పెంచలయ్య, సురేష్, లక్ష్మీనారాయణ, చెంగయ్య, అశోక్, మస్తానయ్య పాల్గొన్నారు.

ప్రతి గడపలోనూ ఆనందమే



చెందోడులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

–ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

కోట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలోనూ ఆనందం వ్యక్తమవుతుందని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని చెందోడు సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చెందోడు, విద్యానగర్ పరిధిలోని అన్నీ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ ప్రభుత్వం నుంచి ఎంత మేర లబ్ధి చేకూరిందన్న విషయం వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపలో తిరుగుతుంటే ప్రజాభిమానం కనిపిస్తుందన్నారు. ప్రజలు అభిమానంతో వచ్చి తమ కుటుంబానికి రూ.లక్ష వచ్చింది, తమకు రూ.2 లక్షలు వచ్చిందని చెబుతున్నారన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ వెంకటరమణయ్య, సాయిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషా, గురుస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన మరో 30 ఏళ్లు కొనసాగాలి



సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న గౌడ సంక్షేమ సంఘం నాయకులు

పెళ్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన మరో 30 ఏళ్లు కొనసాగాలని గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అట్ల కృష్ణయ్య అన్నారు. మంగళవారం పునబాక గ్రామంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ జాగృతి సంఘం అధ్యక్షుడు అట్ల గోపాలయ్య, ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, నాయకులు నీలం రాధయ్య, నీలం కృష్ణయ్య, అట్ల అంకయ్య, నీలం భక్తవత్సలం, నరసయ్య, రామయ్య, పురుశోత్తం తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా చూడాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ

తడ: ఆస్తి యాజమాన్య పత్రాల పంపిణీలో తప్పులు జరగకుండా చూడాలని గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. భూ రీసర్వేతో లబ్ధి పొందనున్న వారికి అందించే ఆస్తి యాజమాన్య పత్రాలు పంపిణీపై ఆయన మంగళవారం ఎంపీడీఓ మురళీకృష్ణ అధ్యక్షతన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ ఆస్తి యాజమాన్య పత్రాల పంపిణీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ఆయన తడకండ్రిగ పంచాయతీ, బీఎల్‌పాడు, వాటంబేడు పంచాయతీలోని పల్లెపాళెం గ్రామాల్లో పర్యటించి, సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ విజయ్‌కుమార్ ఉన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం ధ్యేయం

ఓజిలి: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నాయుడుపేట ఏఎంసీ డైరెక్టర్ చప్పిటి దీప్తి అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లెలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు హామీలను విస్మరించారని విమర్శించారు.

34 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు

దొరవారిసత్రం: కృష్ణాపురం, నెలబల్లి గ్రామాల్లో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో డీఏపీసీయూ సహకారంతో 34 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆర్‌ఏఎఫ్ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ, ఏఎస్‌ఎం హరిత పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): మండలంలోని పలు సచివాలయాలు, పాఠశాలలను ఎంపీడీఓ వినీల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఎంపీడీఓ వినీల్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాదర్శంగా అమలు చేయాలని సూచించారు.

కూలీల సంఖ్య పెంచాలి

రాపూరు: ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య పెంచాలని పీడీ వెంకట్రావు పేర్కొన్నారు. రాపూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని చూపించాలన్నారు. ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఎంపీడీఓ అమోస్‌బాబు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ విక్రయిస్తే చర్యలు



తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్సు అధికారులు

చిల్లకూరు: ఆక్వా రైతులకు యాంటీ బయాటిక్స్ విక్రయిస్తే చర్యలు తప్పవని ఆక్వా ఫీడ్ దుకాణదారులను జిల్లా మత్స్యశాఖాధికారి చాంద్‌బాషా హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఆక్వా ఫీడ్ దుకాణాలను మంగళవారం టాస్క్‌ఫోర్సు అధికారులు తనిఖీ చేశారు. ఆక్వా సాగులో వినియోగించే పలు రకాల రసాయనాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని దుకాణాల్లో సర్టిఫైడ్ మందులు ఉన్నట్లు గుర్తించి, వాటి వివరాలు తెలియజేయాలని దుకాణ యజమానులకు సూచించారు. ఈ తనిఖీల్లో తిరుపతి ఫుడ్‌సేఫ్టీ అధికారి నర్మద, నెల్లూరు ఎంపెడా అధికారి రవీంద్రబాబు, చిల్లకూరు తహసీల్దార్ స్వర్ణ, మత్స్యశాఖాధికారి రెడ్యానాయక్, నాయుడుపేట ఇన్‌స్పెక్టర్ రఘుబాబు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో కల్తీ నిరోధమే లక్ష్యం

కోట: ఆక్వాసాగులో కల్తీ నిరోధమే లక్ష్యంగా తనిఖీ చేస్తున్నామని టాస్క్‌ఫోర్సు అధికారులు తెలిపారు. కోటలోని ఆక్వా ఫీడ్ అండ్ కెమికల్స్ విక్రయించే దుకాణాల్లో ఫీడ్ నిల్వలను మంగళవారం వారు పరిశీలించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రుతుప్రభు, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ నర్మద తదితరులు దుకాణాల్లో విక్రయిస్తున్న కెమికల్స్, వాటి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ఆక్వారైతులు ఫీడ్, కెమికల్స్ కొనుగోలు చేసే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రెడ్యానాయక్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



బహుమతి అందజేస్తున్న మహబూబ్‌బాషా, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

గూడూరు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వ్యాయామ విద్య రీజినల్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన జాతీయ, స్పోర్ట్స్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఒత్తిడిని తట్టుకోవాలంటే కచ్చితంగా వ్యాయామం అవసరమన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ నమఃశివాయ, పీటీఏ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్, పీఈటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



ఏరూరులో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది



కోటలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చిల్లకూరు: ప్రతి ఒక్కరూ బాలికల సంరక్షణను బాధ్యతగా తీసుకుని భావితరాల వారికి ఆడబిడ్డలను అందించేలా చూద్దామని ఐసీడీఎస్ అధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని చిల్లకూరు, తిక్కవరం, చింతవరం ఐసీడీఎస్ సెక్టార్ల పరిధిలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. చిల్లకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగిశెట్టి రేణుక, శివజ్యోతి మాట్లాడుతూ నేడు బాలికల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే దిశ యాప్‌ను వాడుకలోకి తీసుకువచ్చిందన్నారు. అలాగే ఏరూరులో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు, ఆయాలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు.

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలాయపల్లి మండలంలోని జయంపు జెడ్పీ హైస్కూలులో మంగళవారం జయంపు సచివాలయం మహిళా సంరక్షకురాలు రజని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పాఠశాలల్లో..

తడ: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, రామాపురం పాఠశాలల్లో బాలికా దినోత్సవం నిర్వహించారు.బాలికలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నరశింహరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకులంలో..

నాయుడుపేటటౌన్: పుదూరులోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం బాలికల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపల్ హెచ్ పద్మజ, వైస్ ప్రిన్సిపల్ తన్నీరు శశికళ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

డక్కిలి: మహిళలు అన్నీ రంగాల్లో ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత తెలిపారు. మండల కేంద్రమైన డక్కిలిలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం జాతీయ బాలల దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ సుమతి, అంగనవాడీ వర్కర్లు గురవమ్మ, సుకన్య, ప్రసన్న, సుబ్బమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

కోట: బాల్య వివాహాలు నిర్మూలించాలని సీడీపీఓ జ్యోతి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికాదినోత్సవం నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కవిత, పద్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో కలువాయి విద్యార్థికి ద్వితీయ స్థానం



బహుమతి అందుకుంటున్న లక్ష్మీసాహితి

కలువాయి: నెల్లూరులో నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో కలువాయి జెడ్పీ హైస్కూలుకు చెందిన ఎస్.లక్ష్మీసాహితి ద్వితీయ స్థానం పొందింది. బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పోటీల్లో గెలిచినందుకు లక్ష్మీసాహితికి ప్రశంసా పత్రం, రూ. 5 వేలు నగదు బహుమతి అందజేశారు. ప్రతిభ కనబరిచిన లక్ష్మీ సాహితిని పాఠశాల హెచ్‌ఎం జనార్దనరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

సైదాపురం: మామిడి రైతులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏఓ హైమావతి కోరారు. మండలంలోని జోగిపల్లె, సైదాపురం గ్రామాల్లో ఉన్న పలు మామిడి తోటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మామిడి కాయ నిమ్మకాయ పరిణామంలో ఉన్నప్పుడు పోటాషియం నైట్రేట్ లీటర్లు నీటికి 10 గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు.

కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దు

వెంకటగిరిరూరల్: వరిలో పైపాటుగా ఎట్టి పరిస్థితుల్లో కాంప్లెక్స్ ఎరువులను వాడవద్దని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ సూచించారు. మండలంలోని కె ఉప్పరపల్లెలో మంగళవారం నెల్లూరు ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆత్మా ఏడీఏ భాస్కరయ్య , జిల్లా వనరుల కేంద్రం ఏఓ జి వేణుగోపాలరావు, సుధ, ఏఓ సుజాత, వీఏఓ సుమతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నాయుడుపేట: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఫిబ్రవరి 11 తేదీ నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి సంయుక్త కోరారు. కోర్టు ప్రాంగణంలో మంగళవారం నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీపీ స్వాతి రెడ్డి, నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ పార్థసారథిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మండిగ సోమశేఖర్, దశయ్య, చెంచుకృష్ణయ్య, చదలవాడ కుమార్, కిషోర్, గంగాప్రసాద్, సీఐలు ప్రభాకర్‌రావు, వైవీ సోమయ్య పాల్గొన్నారు.

సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారిగా చంద్రముని

సూళ్లూరుపేట: స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఆర్ చంద్రముని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఆయన తిరుపతి జిల్లా కలెక్టర్ కేవెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ, జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎం శ్రీనివాసరావులను మర్యాదపూర్వకంగా కలిశారు.

మహిళల మెడల్లో చైన్ల స్నాచింగ్

గూడూరు రూరల్: వెంకటగిరి మార్గంలోని కొమ్మనేటూరు సమీపంలో ఒంటరిగా నడిచి వెళుతున్న ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను గుర్తు తెలియని దొంగలు మోటారు సైకిల్‌పై వచ్చి లాక్కెళ్లిన సంఘటన మంగళవారం కలకలం రేపింది. రూరల్ పోలీసుల కథనం.. కాంద్ర గ్రామానికి చెందిన కల్పన కొమ్మనేటూరు సచివాలయంలో ఏఎస్‌ఎంగా పనిచేస్తోంది. మంగళవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు బస్సు దిగి నడిచి వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి అడ్రస్ చెప్పాలంటూ ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కుని అక్కడి పరారయ్యారు. అదేమార్గంలోని నాయుడుపాళేనికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఉమామహేశ్వరి నడిచి వెళుతుండగా ఆమె మెడలోని ఒకటిన్నర సవర్ల బంగారు గొలుసును కూడా లాక్కెళ్లారు. ఈ మేరకు బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ జి.దశరథరామారావు, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని దాడి దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల నుంచి వివరాల సేకరించారు. నిందితుల కోసం నిఘా ఉంచామని, వారి కోసం గాలింపు చేపడుతున్నట్లు వెల్లడించారు.

హెల్మెట్ ధరిద్దాం..ప్రాణాలు కాపాడుకుందాం



గూడూరు: అవగాహన ర్యాలీ చేస్తున్న పోలీసులు

గూడూరు: హెల్మెట్ ధరించి, ద్విచక్ర వాహనాలను నడిపి, ప్రాణాలను కాపాడుకుందామని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో పాతబస్టాండ్ నుంచి, హెల్మెట్‌లు ధరించి, నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎంతో విలువైన మీ ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయని, కచ్చితంగా హెల్మెట్ ధరించి, ద్విచక్ర వాహనాలను నడపడంతో ప్రమాదాల బారిన పడకుండా సురక్షితంగా ఉంటారన్నారు. ప్రమాదాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ క్రమంలోనే ప్రజలను చైతన్యవంతుల్ని చేసేలా, ఇలాంటి అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ప్రాంతీయ ఉప రవాణా శాఖాధికారి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రహదారి భద్రతా వారోత్సవాలను 34 ఏళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు హజరత్‌బాబు, దశరథరామారావు, వెంకటేశ్వరరావు, ఎంవీఐలు జకీర్, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియమాలు విధిగా పాటించాలి

వెంకటగిరి: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు విధిగా పాటించాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో పట్టణంలోని ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. పట్టణంలో ఆటోలపై సెక్యూరిటీకోడ్ నంబర్లు ఏర్పాటు చేయాలని స్థానిక సీఐ రామకృష్ణను ఆదేశించారు. కార్యక్రమంలో వెంకటగిరి, బాలాయపల్లి ఎస్‌ఐలు జిలానీ, వీరనారాయణ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

దొరవారిసత్రం: వాహనాలు నడిపే ప్రతి వాహనచోదకుడు నిబంధనలు పాటించడంతో పాటు జాగ్రత్తలు తీసుకోవాలని నాయుడుపేట రూరల్ సీఐ సోమయ్య అన్నారు. దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనచోదకులకు స్థానిక పోలీసులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, సూళూరుపేట ఎంవీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ తిరుమలరావు మాట్లాడుతూ హెల్మెట్ వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవన్నారు.